క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హిల్‌రిడ్జ్ విల్లాస్, హిల్‌రిడ్జ్ అపార్ట్‌మెంట్స్, ఎల్లా హోటల్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతి సరోవర్, ఎస్‌ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, జీపీఆర్‌ఏ క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

మదినాగూడ సబ్ స్టేషన్ పరిధిలో..

మియాపూర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దీప్తీశ్రీనగర్, మదీనాగూడ మెయిన్‌రోడ్డు, సీబీఆర్ ఎస్టేట్, శాంతినగర్, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, ఆల్విన్‌ఎక్స్‌రోడ్డు, టాకిటౌన్ ఏరియా, కృషినగర్, ప్రశాంత్‌నగర్, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, రాఘవేంద్ర పాంచజన్య ,అలియన్స్ అపాయింట్‌మెంట్, స్వర్ణపురి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ సీజ్.. కేసు నమోదు



పరికి చెరువు వద్ద ట్రాక్టర్‌ను సీజ్ చేసిన అధికారులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని గొలుసుకట్టు చెరువైన పరికి చెరువులో టిప్పర్లు, ట్రాక్టర్లతో వ్యర్థాలను తీసుకువచ్చి డంపింగ్ చేస్తున్న వారిపై అధికారులు కేసులు పెట్టారు. బుధవారం పరికి చెరువు కబ్జా.. మాయం అవుతున్న ప్రభుత్వ భూములు అనే శీర్షికన ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి కూకట్‌పల్లి మండల తహశీల్దార్ గోవర్ధన్, మండల ఆర్‌ఐ శ్రీనివాస్ రెడ్డిలు ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో చెరువు పరిసరాల్లో నిర్మించిన గదులను కూల్చివేయటం జరిగిందని, మరోసారి పునరావృతం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

17న డాక్యుమెంటరీ ప్రదర్శన

రాయదుర్గం: మనూలోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ‘అదర్ కోహినూర్స్, ది రాక్స్ ఆఫ్ ది హైదరాబాద్’ పేరిట రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శిస్తారు. యూనివర్సిటీలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) పర్యవేక్షణలో దర్శకులు ఉమామగల్ దర్శకత్వంలో నగరంలోని శిలల కథ ఆధారంగా రూపొందించారు.

బీజేపీలో భారీ చేరికలు



మాదాపూర్: మాదాపూర్‌లోని చందానాయక్ తండాలో బుధవారం పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు పార్టీలో చేరినట్టు తెలిపారు. రానున్న రోజులలో నియోజకవర్గంలో భారీ చేరికలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, సునీల్‌సింగ్, సంతోష్,అనిల్‌కుమార్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

మియాపూర్: తప్పిపోయిన బాలుడిని వెతికి కుటుంబ సభ్యులు చందానగర్ పోలీసులు బుధవారం క్షేమంగా అప్పగించారు. ఎస్‌ఐ రఘు తెలిపిన వివరాల ప్రకారం... శేరిలింగంపల్లిలోని నల్లగండ్ల ఫ్లైఓవర్ సమీపంలోని గుడిసెల్లో నివాసం ఉంటున్న దుర్గాప్రసాద్, పోచమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు అఖిల్(2) ఉన్నారు. వీరు చెత్త ఏరుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నెల 13వ తేదీ ఉదయం కుమారుడు అఖిల్‌ను నానమ్మ మాణిక్యమ్మ వద్ద ఉంచి పనికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి బాలుడు కనిపించలేదు. దీంతో 14వ తేదీ రాత్రి చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించగా చందానగర్‌లోని గంగారం ఆర్‌ఎస్ బ్రదర్ వద్ద బాలుడు అఖిల్ బుధవారం మధ్యాహ్నం కనిపించాడు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకురాగా ఎస్‌ఐ రఘు తల్లిదండ్రులకు అప్పగించారు.

ఉత్సవాలకు వేళాయె..



ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి

ముస్తాబవుతున్న బీరంగూడ భ్రమరాంబిక మల్లికార్జున ఆలయం



ముస్తాబవుతున్న భ్రమరాంబిక మల్లికార్జున ఆలయం

- రేపటి నుంచి 21వ తేదీ వరకు కొనసాగనున్న వేడుకలు
- తరలిరానున్న ఐదు లక్షల మందికి పైగా భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: మహా శివరాత్రిని పురస్కరించుకొని ఆరో శతాబ్దానికి చెందిన బీరంగూడ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానం ఉత్సవాలకు ముస్తాబవుతోంది. బాదామి చాళుక్యులు, రాష్ట్ర కూటులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయ రాజుల కాలంలో గొప్ప పుణ్యక్షేత్రంగా వెలుగొందింది. భృగుమహర్షి ఈ ప్రదేశంలో తపస్సు చేసినట్లు పురాణాలలో ఉందని స్థానికులు చెబుతున్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఐదు రోజుల పాటు స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

పూజా కార్యక్రమాల వివరాలు

ఫిబ్రవరి 17వ తేదీ నుంచి శివరాత్రి మహోత్సవాలు ప్రారంభమై 21వ తేదీవరకు కొనసాగుతాయని ఆలయ అర్చకులు ప్రహ్లాద తెలిపారు. శుక్రవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, ధ్వజారోహణ, నవగ్రహారాధన, అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారికి బిల్వార్చనతో ప్రత్యేక పూజలు ఉంటాయి. 18వ తేదీన అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారికి రుద్రాభిషేకంతో పలు పూజలు నిర్వహిస్తారు. 19న కల్యాణ మహోత్సవం, 20న పల్లకీసేవ, 21న చివరి రోజు స్వామివారికి పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, బలిహరణ, స్వామివారికి పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

విద్యుత్ దీపాలంకరణ

మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ భీంరెడ్డి, అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.

పది నిమిషాలకో బస్సు

భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల కోసం పటాన్‌చెరు, బీరంగూడ కమాన్, లింగంపల్లి నుంచి మొత్తం 12 బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. రద్దీని బట్టి మినీ ఏసీ బస్సులు నడుపుతాం. అదేవిధంగా ఏడుపాయలకు 15 బస్సులు ఏర్పాటు చేశాం. ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది.

– శ్రీనివాస్, హెచ్‌సీయూ డిపో మేనేజర్

భూవివాదాలు త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలి

సీఎస్ శాంతికుమారిని కలిసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణ అనుమతులు, యూఎల్‌సీ సమస్యలు, భూవివాదాల పరిష్కారానికి విధానపరమైన నిర్ణయాలలో జరుగుతున్న జాప్యాన్ని తొలగించి గృహ నిర్మాణ అనుమతులకు, ఇంటి రిజిస్ట్రేషన్‌ల అనుమతులు లభించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కోరారు.ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలోని పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని జీఓ నంబర్ 59 ద్వారా స్థలాల క్రమబద్ధీకరణలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము భారం కాకుండా ఒకే సర్వే నంబర్‌లో ఒకే విధంగా చెల్లించేటట్లుగా ఆదేశాలు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.పాపిరెడ్డినగర్‌లో ఏబ్లాక్ 6వేలు చెల్లించాల్సి ఉండగా సీ బ్లాక్‌లో రూ.10వేలు చెల్లించాలని జారీ చేసిన ఉత్తర్వులను పరిశీలించి న్యాయబద్ధంగా రుసుము విధించాలని కోరారు. శేరిలింగంపల్లిలోని పలు ప్రాంతాలలో యూఎల్‌సీ క్లియరెన్స్, రిజిస్ట్రేషన్ సమస్యలు, గోకుల్‌ఫ్లాట్స్, రాంనరేష్‌నగర్, ప్రశాంత్‌నగర్, బికే ఎన్‌క్లేవ్ కాలనీలో రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.



అమర సైనికులకు ఘన నివాళి

రాయదుర్గం: దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర సైనికులకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం రాత్రి హెచ్‌సీయూ క్యాంపస్‌లోని కార్గిల్ చౌక్ వద్ద పుల్వామా సైనికులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రావణ్ ,ప్రణవ్, సందీప్, సాక్షి, నేహ, సౌరభ్,మహేష్, నిషా, అక్షయ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



నడిగడ్డతండాలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: మియాపూర్‌లోని నడిగడ్డతండాలో బుధవారం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గాంధీ హాజరై నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బంజారా ఆరాధ్య దైవమైన సంత్‌సేవాలాల్ గిరిజనుల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత బంజారా సేవా సంఘ్ తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ మోహన్‌సింగ్, ఏబీఎస్ఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ దశరథ్‌నాయక్, గిరిజన రాష్ట్ర నాయకులు తుకారాం నాయక్, తండావాసులు సీతారాంనాయక్, రెడ్యానాయక్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: భవిష్యత్‌లో లంబాడీల సహకారం తీసుకొని సేవాలాల్ మహరాజ్ దేవాలయ నిర్మాణానికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు అన్నారు. చిట్కుల్ గ్రామంలో సేవాలాల్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సేవాలాల్ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పోల్ సింగ్, బాబు సింగ్, గణేష్, జగన్ బాబు, నారాయణ రెడ్డి, బంజారా సంఘం సభ్యులు, ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



నేతాజీనగర్‌లో..

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో భాగంగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సేవాలాల్ చిత్రపటానికి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌నాయక్, బాబునాయక్, బాషానాయక్, సూర్య రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీనగర్‌లో...

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీనగర్‌లో బంజారా సమితి ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని అన్నదానం చేశారు. కాలనీ అధ్యక్షులు భేరీ రాంచందర్ యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ బంజార సమితి అధ్యక్షులు హనుమంత్‌నాయక్, నేతాజీనగర్ ఉపాధ్యక్షులు రాయుడు, స్థానికులు రవిసింగ్ నాయక్, దశరథ్ నాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు రాబట్టాలి

రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న జాయింట్ డైరెక్టర్ రాజీవ్

రాయదుర్గం: ఈ విద్యాసంవత్సరం పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చేలా చూడాలని రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ పి రాజీవ్ ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. తరగతి గదులు, ఉపాధ్యాయుల బోధన, విద్యను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు రావడానికి తగిన ప్రణాళికను రూపొందించుకొని ముందుకుసాగాలన్నారు. అంతకుముందు ప్రాక్టీస్ పేపర్స్ పరిశీలించారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తాజ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ శక్తి కేంద్రాల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

మియాపూర్: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో ప్రజాగోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్రాల కార్నర్ సమావేశంను బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా మాజీ పార్లమెంట్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ హాజరై మాట్లాడుతూ... నియోజకవర్గంలో గత 9 సంవత్సరాల్లో ఎమ్మెల్యే గాంధీ ప్రభుత్వ స్థలాలు, చెరువుల కబ్జాలకు పాల్పడడం తప్ప చేసిందేమీలేదని ఎద్దేవా చేశారు. పాపిరెడ్డి కాలనీలో బెల్ట్ షాపులు చాలా ఉన్నాయని వాటిని తొందర్లోనే మూసి వేయిద్దామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి పథకాలను నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రజలకు అందే విదంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, జిల్లా వైస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రాఘువేంద్రరావు, నాయకులు ఎల్లేష్, రాజుశెట్టి అనిల్‌కుమార్, రమేష్, శక్తి కేంద్రాల ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



క్రీడాపరికరాలు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం బచ్చుగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ హానీ ఫిన్ ఇండియా సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు క్రీడా పరికరాలు, కంప్యూటర్, ప్రింటర్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ...గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమేకాకుండా ప్రతి ఒక్కరూ పాఠశాలల్లో చేరే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సీడబ్ల్యూసీ మెంబర్ వెంకటేశం బచ్చు గూడెం పాఠశాల హెచ్‌ఎం అమరేందర్ రెడ్డి, ఇంద్రేశం పాఠశాల హెచ్‌ఎం శ్రీని వాస్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ మహాజీవ్ పాల్గొన్నారు.

ఎదగాలంటే శ్రమించక తప్పదు



గుణశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: సవాళ్లను స్వీకరించని వ్యక్తి ఏమీ సాధించలేడని, ఎదగాలంటే కష్టపడక తప్పదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ డీజీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) అధ్యక్షుడు ప్రొఫెసర్ వి.గుణశేఖర్‌రెడ్డి అన్నారు. రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎంచుకున్న రంగంలో రాణించాలంటే ప్రణాళికలు వేసుకొని క్రమపద్ధతిలో పనిచేసి విజయతీరాలను చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారతీయ నేపథ్య గాయకులు శ్రీరామచంద్ర, హారిక నారాయణలు తెలుగు, హిందీ పాటలతో ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, చైర్మన్ డాక్టర్ పి.త్రినాథరావు, విద్యార్థి సమన్వయకర్త వేద ప్రజ్ఞారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతే మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

- కంటి వెలుగును విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రారంభమైన రెండో విడత కంటి వెలుగు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తమ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలను కంటి వెలుగు కేంద్రాలకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించాలని సూచించారు. అవసరమైతే ఎక్కువ మంది జనాభా ఉన్న ప్రాంతాల్లో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 100 రోజుల పాటు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలందరికి వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. . హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాలు, రాం నరేష్‌నగర్ కమ్యూనిటీ హాలు, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో పీజేఆర్ నగర్ కమ్యూనిటీ హాలు, వివేకానందనగర్ డివిజన్ పరిధిలో వెంకటేశ్వరనగర్ కాలనీలోని సగర సంఘం కమ్యూనిటి హాలులో, కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ కమ్యూనిటీహాలులో కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు.

మహిళలకు అండగా షీ టీమ్



పటాన్‌చెరు టౌన్: మహిళలకు అండగా షీ టీమ్ ఉందని పటాన్‌చెరు షీటీమ్ ఎస్‌ఐ నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో షీటీమ్ సేవలపై హెడ్ కానిస్టేబుల్ వీరమణితో కలిసి బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు షీ టీమ్ సేవలు, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరించారు. ఆకతాయిలు ఎవరైనా వేధిస్తే 100కు లేదా 7901148896 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

బీజేపీ అధికారంలోకి వచ్చాక హామీలన్నీ నెరవేరుస్తాం

పాదయాత్రలో యోగానంద్



హైదర్‌నగర్ డివిజన్‌లో సమస్యలను పరిశీలిస్తున్న యోగానంద్, బీజేపీ నాయకులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లోని కృష్ణవేణి కాలనీ, ప్రశాంతినగర్, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో బుధవారం బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జెల యోగానంద్ పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో ఉచిత తాగునీరు ఇస్తామని చెప్పారని ఉచిత నీరు అటుంచితే అసలు నీళ్లు రాని పరిస్థితి కొన్ని కాలనీల్లో ఉందన్నారు. ఇక కొన్ని కాలనీల్లో డ్రైనేజీ బ్లాక్ అవటంతో మురుగు రోడ్లపై పారుతోందన్నారు. కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. రాత్రి వేళల్లో దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. ఫాగింగ్ కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చి ఎనిమిదేళ్లయినా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో విజిత్‌వర్మ, వెలగ శ్రీనివాస్, నవీన్‌గౌడ్, మనోహర్, శేషయ్య, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్రీన్‌బేగంకు పీహెచ్‌డీ



రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థినికి బుధవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగంలో పరిశోధక విద్యార్థిని ఆఫ్రీన్ బేగం డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎండి సాదత్‌షరీఫ్ పర్యవేక్షణలో ‘ప్రభుత్వరంగంలో పెట్టుబడి ప్రవర్తన-ఉద్యోగులు-తెలంగాణకు సూచన’ అనే అంశంపై థీసిస్ సమర్పించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ నాయక్ అన్నారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రాఫిక్ సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ మాట్లాడుతూ రోడ్లపై భారీ గేట్స్, హెచ్చరిక సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని కోరగా.. దాతలు ముందుకు వచ్చారు.

కంటి వెలుగు కేంద్రాలు ఇవే..

గచ్చిబౌలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కంటి వెలుగు కేంద్రాలను శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో పలుచోట్ల ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. ఒక్కో కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 8 మంది వైద్య సిబ్బంది ఉంటారు. మొదటి విడతలో 1,83,000 మంది పరీక్షలు చేయించుకోగా 40వేల మందికి కళ్ల అద్దాలు అందించడం జరిగిందని, రెండవ విడతలో అంతకన్నా ఎక్కువ మంది ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.

డివిజన్	కాలనీ	కంటి వెలుగు కేంద్రం
కొండాపూర్	అంజయ్యనగర్	సగర సంఘం కమ్యూనిటీ హాల్
కొండాపూర్	కొత్తగూడ	కమ్యూనిటీ హాల్
గచ్చిబౌలి	రాయదుర్గం	వార్డు కార్యాలయం
శేరిలింగంపల్లి	లింగంపల్లి	పట్టణప్రాథమిక ఆరోగ్య కేంద్రం
మాదాపూర్	అయ్యప్పసొసైటీ	సొసైటీ కల్చరల్ క్లబ్
మియాపూర్	మయూరీనగర్	కమ్యూనిటీహాల్
హఫీజ్‌పేట్	జనప్రియనగర్	కమ్యూనిటీహాల్
చందానగర్	చందానగర్	పీజేఆర్ స్టేడియం
భారతినగర్	ఎంఐజీకాలనీ	సర్కిల్ కార్యాలయం